



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటాలు

◆ వ్యవసాయం, ఉపాధి, సాగునీరుపై దృష్టి
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ
◆ మహాసభల విజయవంతంపై కృతజ్ఞతలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

వ్యవసాయం, ఉపాధి, విద్య, సాగునీరు, కార్మిక సంక్షేమం తదితర అన్ని సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రామకృష్ణ తెలియజేశారు. బుధవారం నాడు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం పట్టణంలోని కామ్రేడ్ బడా సుబ్బిరెడ్డి, కామ్రేడ్ పోలా రామాంజనేయులు ప్రాంగణంలో సిపిఎం జిల్లా 14వ మహాసభలు దిగ్విజయంగా జరిగాయన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధిపై మహాసభల్లో చర్చ జరిగిందన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎనిమిది తీర్మానాలు చేశామన్నారు. జిల్లాలో పండించే ప్రతి పంటకూ గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బిజెపి ప్రభుత్వం అసంబద్ధంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లును తక్షణం రద్దు చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు ఆపాలన్నారు. మతోన్మాద చర్యలు, విధానాలకు వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తామని తెలియజేశారు. వ్యవసాయ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు ఇవ్వాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కార్మికునికి పనులు కల్పించాలన్నారు. వీటితో పాటు జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిరంతరం ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహాసభ వేదికగా సిపిఎం ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా చేసిన పోరాటాలను సమీక్షించుకున్నామన్నారు.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేలా మోడీ పాలన

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రధాని నరేంద్ర మోడీ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసే చర్యలు తీసుకుంటున్నారని రామకృష్ణ విమర్శించారు. రైతులు, కార్మికులను నష్టం చేసేలా నల్లచట్టాలు తెచ్చారన్నారు. విద్యారంగంలో కేంద్రం జోక్యం పెరిగి రాష్ట్రాలపై ఆధిపత్యం చెలాయిస్తోందన్నారు. దేశంలో మతోన్మాద శక్తుల చర్యలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దళితులు, ముస్లిం, మైనార్టీలపై దాడులు అధికం అయ్యాయన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోడీ పాలనను అనుసరిస్తూ మతతత్వ విధానాలు తెస్తుండటం ఆందోళన కలిగించే అంశం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం నియోజకవర్గానికి నీళ్లు తీసుకెళ్లేందుకు హంద్రీనీవా కాలువలో లైనింగ్ పనులు చేపట్టారని, తద్వారా ఇక్కడి భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వీటన్నింటిపై ప్రజలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. సిపిఎం మహాసభలకు సహకరించిన వారందరికీ ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జివిఎల్.నరసింహులు, జగన్మోహన్ పాల్గొన్నారు.



తాగడానికి పర్మిట్ రూమ్..!

ఓపెన్ డ్రింకింగ్ పెరిగిందని పర్మిట్‌కి అనుమతి

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ఇప్పటికే మద్యం అమ్మకాలు విచ్చల విడిగా అయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మద్యం దుకాణాల వద్దనే మందు తాగేందుకు వీలుగా పర్మిట్ రూములకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికే అనధికారికంగా అన్ని మద్యం దుకాణాల్లో విచ్చలవిడిగా పర్మిట్ రూములు నడుస్తూ వచ్చాయి. ఇక నుంచి అధికారికంగా అనుమతులివ్వడంతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు మరింతగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగిన విషయం తెలిసిందే. ఎటువంటి అధికారిక అనుమతుల్లేకున్నా అనంతపురం నగరంలోని అన్ని మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములు నడుస్తూ వచ్చాయి. ఎక్సైజ్ అధికారులు కూడా వాటి వైపు కన్నెత్తి చూసి చర్యలు తీసుకున్నది లేదు. ఆరుబయట ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారిపై పోలీసులు దాడులు చేసి జరిమానాలు విధించేవారు. ఇదే కారణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చూపించి పర్మిట్ రూములకు అనుమతిస్తున్నట్లు ప్రకటించింది.

పర్మిట్ పొందాలంటే అదనంగా చెల్లించాల్సిందే

పర్మిట్ రూములు పొందాలంటే షాపు నిర్వాహకులు అదనంగా డబ్బులను ఎక్సైజ్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. రూ.55 లక్షల ట్యాక్స్ స్లాబ్‌లోనున్న ఎ4 దుకాణానికి ఐదు లక్షల రూపాయలు, రూ.65 లక్షల నుంచి రూ.85 లక్షల్లోపు ట్యాక్స్ స్లాబ్‌లోనున్న దుకాణానికి రూ.7.50 లక్షలు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్సును చెల్లించాల్సి ఉంటుంది. ఇది కట్టిన వారికి పర్మిట్ రూమ్‌కు అనుమతిస్తారు. వెయ్యి చదరపు అడుగుల్లోపు ఈ పర్మిట్ రూమును ఏర్పాటు చేసుకుని నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలనేందుకు అనుమతినిస్తారు. ఇక పర్మిట్ రూములు కూడా అనధికారికంగా బార్లను తలపించే వీలుంది.

మరింతగా అమ్మకాలకు అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం మద్యం అమ్మకాలను నియంత్రిస్తామని ప్రకటనలివ్వడం వరకే పరిమితమవుతోంది. ఇక నుంచి మద్యం దుకాణాల వద్దనే తాగడానికి కూడా అనుమతులివ్వడంతో మద్యం అమ్మకాలు మరింత జోరందుకోనున్నాయి. ఇప్పటికే ఊరూరా బెల్టు షాపులు నడుస్తున్నాయి. వాటి కోసం జిల్లాలో అధికార పార్టీలో కుమ్ములాటలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని మహిళా సంఘాలు పెద్దఎత్తున తప్పు పడుతున్నాయి. ఇప్పటికే మద్యం అమ్మకాలు విచ్చల విడి కావడంతో అనేక అఘాయిత్యాలు జరుగుతుంటే నియంత్రించకపోగా పెంచే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు చేయడం సరికాదని మండిపడుతున్నాయి.



అడ్డగోలు నిర్ణయాలతో నష్టం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

కూటమి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు తీసుకొని విద్యా రంగాన్ని పట్ల అస్తవ్యస్తంగా మారుస్తోందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి, సుధాకర్ విమర్శించారు. బుధవారం కదిరి యుటిఎఫ్ జోన్ ఆధ్వర్యంలో జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో జులై 11 న నుంచి నిర్వహిస్తున్న ఎఫ్ఎ1 పరీక్షలు ఉపాధ్యాయులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సిలబస్ ఒకటి, ప్రశ్నాపత్రాలలో ఇచ్చేది మరొకటి ఉండేవిధంగా ఉందన్నారు. దీనివల్ల విద్యార్థులు చదువులో వెనుకపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలు విద్యార్థులు నేర్చుకున్న అంశాలను వివిధ ప్రశ్నల ద్వారా అంచనా వేసే విధంగా ఉండాలి తప్ప, భయపెట్టే విధంగా వారి స్థైర్యం దెబ్బతీసే విధంగా ఉండకూడదన్నారు. అయితే పరీక్ష పేపర్లను దిద్ది మార్కులు వేయాల్సి ఉండేదని కానీ ఇప్పుడు వచ్చిన విధానంలో, పరీక్ష పేపర్ దిద్దిన తర్వాత కనీసం వారం రోజులు పాటు పేపర్ వర్క్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే యోగాంధ్ర వల్ల వారం రోజులు, మెగా పిటిఎం వల్ల వారం రోజులు ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ఆలోచించి మూల్యాంకన పుస్తకాలలో ఉన్న అసంబద్దాలను, అంశాలను సరళ తరం చేసి, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తాహిర్ వలి , జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున,సంతోష్ కుమార్, జిల్లా సిపిఎస్ కన్వీనర్ సునీల్ కుమార్, నాయకులు రవి వర్ధన్ రెడ్డి, ఖాదర్ బాషా, హనీఫ్ ,మధుసూదన్,రెడ్డి రాజేష్ , వెంగమ నాయుడు, నాగరాజు నాయక్ , జనార్ధన్ , సుధాకర్, కిషోర్,బాలాజీ నాయక్, రమేష్, వెంకటనారాయణ రెడ్డి, నజీర్, జబివుల్ల, ఇర్ఫాన్ భాషా, యుగంధర్ రెడ్డి, సుండుపల్లి గణేష్, వివిధ మండలాల ఉపాధ్యాయులు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐ రాజశేఖర్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడిన పట్నం ఎస్ఐ రాజశేఖర్‌ను సస్పెండ్ చేసి అరెస్ట్ చేయాలని ఎస్‌సి, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బి రాంప్రసాద్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలను కాపాడాల్సిన పోలీసులే న్యాయం కోసం పోలీస్ స్టేషన్ కు వెళ్లిన గిరిజన మహిళ పట్ల లైంగిక దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. పట్నం ఎస్సై రాజశేఖర్ పై తక్షణం క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పట్టుగూళ్ల మార్కెట్‌లోకి వర్షం నీరు

ప్రజాశక్తి-హిందూపురం

వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా హిందూపురం పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో వర్షం నీరు నిలవడంతో రైతులు, అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన పట్టు రైతులు తమ పట్టుగూళ్ళను ఇక్కడికి తీసుకురావడం వర్షపు నీరు నిలబడి ఉండడంతో అనేక అగచాట్లకు లోనయ్యారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ స్పందించి వెంటనే మున్సిపల్ అధికారులతో మాట్లాడి జేసీబీ ద్వారా గుంత తీయించి అక్కడ ఉన్న వర్షపు నీరు అంతా చెరువు కాలువలోకి మళ్లించే విధంగా ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ. జనార్ధన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, ఫిట్టర్ భగవంతప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా బస్సులు నడపాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులకు అనుకూలంగా కలిపి - రొద్దం ఆర్టీసీ బస్సు నడపాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు బుధవారం హిందూపురం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, రొద్దం, కల్లకుంట, చిన్నమంతూరు, చెరుకూరు, పెద్దమంతూరు, శేషాపురం, కలిపి, మరువపల్లి, గ్రామాల నుంచి విద్యను అభ్యసించడానికి హిందూపురం పట్టణంలోకి వివిధ కళాశాలకు 50 మందికి పైగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. వీరికి సరైన ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరవింద్, కిరణ్, అజయ్, సాయి, చంద్ర, గణేష్, కార్తీక్, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో నష్టం

అమెరికా పన్నులపై మోడీ స్పందించాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

అమెరికాతో ప్రధాని నరేంద్ర మోడీ చేసుకుంటున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరి, జంగాలపల్లి పెద్దన్న తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల ప్రతులను సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణతో కలిసి బుధవారం స్థానిక గణేష్ సర్కిల్లో దహనం చేశారు. గణేష్ సర్కిల్ నుంచి గోకులం, బస్టాండ్, హనుమాన్ సర్కిల్ మీదుగా కర్ణాటక నాగేపల్లి వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా షరతులకు తలొగ్గితే దేశంలో సంవృద్ధిగా పండించుకునే గోధుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాలను కార్పొరేట్ కంపెనీల నుంచి దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అమెరికా ఉత్పత్తి చేసే పత్తి, సోయాబీన్స్, జన్యు మార్పిడి విత్తనాలు సుంకాలు లేకుండా దిగుమతి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పాలుతో పాటు, పాల ఉత్పత్తులు అన్ని సుంకాలు లేకుండా దిగుమతులు వచ్చి పడితే మన రైతాంగం పంటలు అమ్ముకునే అవకాశం లేక దివాలా తీస్తాయన్నారు. ఇప్పటికే ఇంగ్లాండ్‌తో చేసుకున్న ఒప్పందాలతో దేశంలో మిరప, పొగాకు, మామిడి, సెనగ ధరలు పడిపోయి రైతాంగంపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి ఈ ఒప్పందాల నుంచి దూరం కావాలని డిమాండ్ చేశారు. దేశీయ ఉత్పత్తులపై అమెరికా వేస్తున్న అధిక సుంకాలపై ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రవీణ్, వెంకటేశు, సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్, సిద్దు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గణేష్ సర్కిల్‌లో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

అస్తవ్యస్తంగా పారిశుధ్య వ్యవస్థ



రోడ్డుపై నిలిచిన మురుగు, వర్షం నీరు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. డ్రైనేజీలు లేకపోవడం.. ఉన్నా పూడికతీతకు నోచుకోకపోవటంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 12 పంచాయతీలున్నాయి. వాటి పరిధిలోని డ్రైనేజీలపై పర్యవేక్షణ లేక గత వారం రోజుల నుండి వర్షానికి రోడ్డు పై మురుగు అక్కడే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరికొన్ని పంచాయతీల్లోని ఎస్సీ కాలనీల్లో అసలు మురుగు కాలువలే నిర్మించలేదు. ప్రతి పంచాయతీలో మురుగు నీటి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నా సంబంధిత అధికారులు ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని, ఇంకా మంజూరు కాలేదని చెబుతున్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామని కోట్లాది రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం ఊదరగొడుతోంది. కానీ గ్రామాల్లోని పరిస్థితి చూస్తే పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడం లేదని, రోడ్లపై నిలిచిన మురుగునీరు దుర్గంధం వెదజలుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామని, సచివాలయాలకు వెళ్లి పంచాయతీ కార్యదర్శులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుని రోగాల బారిన పడకుండా రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

'జిల్లా కేంద్రం మార్పుపై వస్తున్న వదంతులకు స్వస్తి పలకండి'

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రం మార్పుపై వస్తున్న వదంతులను తక్షణం ఆపాలని పుట్టపర్తి పుర ప్రముఖుడు రత్నాకరం కొండమ రాజు విజ్ఞప్తి చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటుకు గత 30 సంవత్సరాల నుండి పుట్టపర్తి వాసులు కలలుగని సాధించుకున్నారని, ఇది ఒక్క రోజు కోరిక కాదని అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి ఆధ్యాత్మిక కీర్తి వల్లే పుట్టపర్తి ప్రపంచ ప్రఖ్యాతి గాంచిందనీ ఆయన గుర్తుచేశారు.40 ఏళ్ల క్రితం సత్యసాయి బాబా సోదరుడు శ్రీ ఆర్.వి. జానకీరామయ్య అప్పటి ముఖ్యమంత్రి విజయభాస్కర్ రెడ్డి, మాజీ ప్రధాని పీ.వి. నరసింహారావు తదితర నేతలతో కలిసి పుట్టపర్తి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసిన విషయాన్ని వివరించారు. అనంతరం పుట్టపర్తి ప్రజలు, నేతలు చేసిన నిరంతర కృషితో, ట్రస్ట్ సభ్యుడు రత్నాకర్ శ్రద్ధతో, గత ప్రభుత్వం కాలంలో జిల్లా ఏర్పాటైందన్నారు. జిల్లా ఏర్పాటు తర్వాత కలెక్టర్ ఆఫీస్, గెస్ట్ హౌస్, ఇతర జిల్లా కార్యాలయాల కోసం సత్యసాయి ట్రస్ట్ భవనాలను అందించిందనిచెప్పారు. అయితే, హిందూపురం ఎమ్మెల్యే ఎన్నికల హామీ కారణంగా జిల్లా మార్పు ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. హిందూపురం కేంద్రంగా జిల్లా చేస్తే, కర్నాటక సరిహద్దుకు సమీపం కావడంతో అభివృద్ధి దిశకు ప్రతికూల ప్రభావం ఉంటుందని రత్నాకరం కొండమ రాజు హెచ్చరించారు. జిల్లా మార్పు జరిగితే, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేష్, సవితమ్మ, సత్యకుమార్ యాదవ్, హిందూపురం ఎంపీ పార్థసారథి, కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ స్పందించి జిల్లా మార్పు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఈ నెల 14 తేదీ నుండి 17 తేదీ వరకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో జరిగే 8 వ ఆంధ్రప్రదేశ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్ బాల్ బాల బాలికల జట్లు ఎంపిక చేసినట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు శెట్టిపి జయచంద్రా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల విభాగంలో ధర్మవరం పట్టణానికి జి కిరణ్మయి, యశస్విని, అంజన బాలుర విభాగంలో విజయ్ తరుణ్, నరసింహ ఎన్నికయ్యారని చెప్పారు. ధర్మవరం పట్టణానికి చెందిన ఆరుగురు బాస్కెట్బాల్ క్రీడా పోటీలకు ఎంపికకావటం గర్వకారణమని తెలియజేసారు, గత నెల 20న అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్స్‌లో వీరు ప్రతిభ చూపి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల , ఉమ్మడి జిల్లా ధర్మాంబా బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగేంద్ర, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రస్థాయిలో స్థాయిలో వీరు రాణించి ధర్మవరం పట్టణానికి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు.



ప్రతిభా విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ధర్మవరంలో ఆర్టీసీ డిపో కార్యాలయ ఆవరణ ముందు నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ నాయకులు నీళ్ల శంకరయ్య, డిపో నాయకులు మోహన్ రావు, దుర్గాప్రసాద్, నాగప్ప మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎంయు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ ధర్నాను నిర్వహించారు. తక్షణమే పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. మహిళా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో నాయకులు మంజు, రమణప్ప వైవియన్ రెడ్డి, మాధవతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను విమర్శించడం తగదు'

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రతిపక్ష పార్టీగా వైసిపి ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేయకుండా కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దాది రెడ్డి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ మాత్రమే రాష్ట్రంలో ప్రతిపక్షమని బాబు, జగన్, పవన్ ముగ్గురు ఒకటే కూటమని అన్నారు. కేంద్రంలోని బిజెపి ఓట్లు దొంగతనం గురించి దేశం మొత్తం తెలిసే విధంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. ఈవీఎంల పొరపాటు వల్లే అన్యాయం జరిగిందని మాట్లాడే జగన్ ప్రజాక్షేత్రంలో కేంద్రంలో ఎందుకు పోరాటం చేయలేకపోతున్నాడని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం కాపాడటానికి ఎన్నికల సంఘంతో పోరాటం చేస్తున్న కాంగ్రెస్ తో జగన్ కలిసి రావాలన్నారు. ఇప్పటికైనా బిజెపి దాని అనుబంధ పార్టీల కుట్రలను గుర్తించి చేతనైతే జగన్ కూడా దొంగ ఓట్ల సాంప్రదాయానికి చెక్ పెట్టడానికి కలిసి రావాలన్నారు.

డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో శ్రీకష్ణదేవరాయల జూనియర్, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల్లో మాదకద్రవ్యాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడి వారి బంగారు జీవితాలను చేజేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. గుట్కా జారదా పొగాకు కొకైన్ వంటి మత్తునిచ్చే పదార్థాలను విచ్చలవిడిగా వాడటం వలన దానికి బానిసలుగా తయారై జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. వీటిని అతిగా వినియోగించడం వల్ల క్యాన్సర్ గుండె, కాలేయ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకి గురవుతున్నారన్నారు. మత్తుకు అలవాటు పడటం వలన విచక్షణ రహితంగా ప్రవర్తించడం జరుగుతుందని తెలియజేశారు. యువత పెడదారి పడకుండా సన్మార్గంలో నడవాలని క్రమశిక్షణతో మెలగాలని దురలవాట్లు మానుకుని జీవితాలను బంగారుమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు, ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి, భక్తవత్సలం, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓలు ఆజాద్, బాల మోహన్ అధ్యాపకులు లక్ష్మీ, అర్షియ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

రైతులకు డ్రోన్లతో సాంకేతిక సాయం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతుల వద్దకు చేరవేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన అన్నదాత రైతు సేవా సంఘం కార్యక్రమంలో భాగంగా అర్హులైన రైతులకు డ్రోన్లను బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ లో ఏడి లక్ష్మణ్ నాయక్, మండల వ్యవసాయ అధికారి ముస్తఫా రైతులకు డ్రోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల ప్రత్యేక ఆసక్తి, మార్గదర్శకత వలన ధర్మవరం రైతులకు ఈ సౌకర్యం అందిందన్నారు. ఫార్మ్ మిషనరీ బ్యాంక్ ఆధ్వర్యంలో, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో, డ్రాగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తయారు చేసిన ఆధునిక వ్యవసాయ డ్రోన్‌లకు అన్నదాత రైతు సేవా సంఘం సభ్యులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ డ్రోన్ సహాయంతో పంటలపై పురుగుమందులు, ఎరువులు తక్కువ సమయంతో, తక్కువ ఖర్చుతో పిచికారి చేయవచ్చు నని చెప్పారు. 80 శాతం సబ్సిడీతో ఆధునిక సాంకేతికత ఇప్పుడు ప్రతి రైతు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డ్రాగో డ్రోన్స్ కంపెనీ రేప్రజెంటివేటివ్ రవి, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్, అన్నదాత రైతు సేవా సంఘం సభ్యులు, రూరల్ మండల అధ్యక్షులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయల ఉత్సవాల ఊసేదీ..?

పురాతన కట్టడాలకు, ప్రాచీన సంపదకు నిలయమైన పెనుకొండ పర్యాటక అభివృద్ధి మాటలకే పరిమితమైందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. శ్రీ కృష్ణదేవరాయల రెండవ రాజధానిగా పేరొందిన పెనుకొండలో పురాతన కట్టడాలకు కొదవలేదు. ఆయన కాలంలో నిర్మించిన ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ కట్టడాలను ప్రభుత్వం పర్యవేక్షించక పోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రభుత్వం నిర్లక్ష్యం పాలకుల అలసత్వం, పురావస్తు పర్యాటక శాఖల మొద్దునిద్రతో పెనుకొండ పర్యాటక అభివృద్ధి ప్రకటనలకే పరిమితమైంది.

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్


ముళ్లకంపల మధ్య మండపం


శిథిలావస్థకు చేరిన పురాతన ఆలయం

2010-11 సంవత్సరంలో శ్రీ కష్ణదేవరాయల పంచ శతాబ్ది పట్టభిషేక మహోత్సవాలతో పెనుకొండ పర్యాటక అభివద్ధిపై ఆశ చిగురించింది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో రఘువీర రెడ్డి ప్రత్యేక చొరవతో రాయల ఉత్సవాలను అంగరంగ వైభంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా అప్పటి పాలకులు పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి, అభివృద్ధికి ప్రకటించిన నిధులు మంజూరు చేశారు. అప్పట్లో కొండ రోడ్డు పనులు మొదలయ్యాయి.అయితే విడుదలైన నిధులతో రోడ్డు పనులు పూర్తి స్థాయి లో కాకపోవడంతో ఆచరణలో ఫలితాలను ఇవ్వలేదు. తిరిగి అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బి. కె. పార్థసారథి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి ఆగిన కొండ రోడ్డు పనులు తిరిగి ప్రారంభించారు. అదే సందర్భంలో కొండపైన శ్రీ ఘన గిరి లక్ష్మి నరసింహ స్వామి ఆలయం పునర్నిర్మాణం చేపట్టాలని తలంచారు. భారీ నరసింహ స్వామి విగ్రహాన్ని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. రాయల ఉత్సవాలను సైతం ఘనంగా నిర్వహించారు. సమైక్యాంధ్ర సమయంలో మాత్రం ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించలేదు. తదనంతరం ఏర్పడిన వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి శంకర్ నారాయణ కొండ రోడ్డుకు తారు పనులు పూర్తి చేయించారు. అయితే రాయల ఉత్సవాల నిర్వహణను మరిచారు. కరోనా రావడంతో రాయల ఉత్సవాలపై నీలి నీడలు కమ్ముకున్నాయి. కరోనా నేపథ్యంలో రాయల ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించలేదు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. రాయల ఉత్సవాలతో పాటు పర్యాటక అభివృద్ధి పరుగులు పెడుతుందని అందరూ భావించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే గా పోటీ చేసిన మంత్రి సవిత సైతం రాయల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని పలు సందర్భాల్లో ప్రకటించారు. గతంలో ఆగష్టు నెలలో రాయల ఉత్సవాలను ప్రభుత్వాలు నిర్వహించేది. ప్రస్తుతం ఆగష్టు నెల వచ్చినా రాయల ఉత్సవాల ఊసే లేదు. రాయల ఉత్సవాలను ప్రభుత్వం మరిచిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. మంత్రి సవిత పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాలకు రంగులు వేయించడం జరిగింది. అదేవిధంగా పట్టణంలోని అంబేద్కర్, తెలుగు తల్లి, గాంధీ విగ్రహాలకు రంగులు వేయించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, పాలకులు స్పందించి రాయల ఉత్సవాలను నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.అదేవిధంగా రాయల జయంతి ని కూడా అధికారికంగా నిర్వహించాలని బలిజ సంఘాల నాయకులు, బలిజ సామాజివర్గం వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

శిథిలావస్థలో చారిత్రాత్మక కట్టడాలు

పట్టణంలో ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.తిమ్మరసు -సమాధి, తిమ్మరసు బందీఖానా, పురాతన బావులు, కోటగోడలు, కట్టడాలు, కొండపై ఖిల్లా, లక్ష్మినరసింహస్వామి ఆలయం, కోనేరు, బురుజులు ఇలా ఎన్నో అద్భుత కట్టడాలు ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. పురాతన సంపద పూర్తిగా కరుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. అనేక కట్టడాలు నూతన శోభ సంతరించుకోక పోవడంతో వాటి ఆనవాళ్లు కనిపించకుండా పోయే పరిస్థితి నెలకొంది. ప్రాచీన కట్టడాలను భావితరాలకు గుర్తుండేలా మరమ్మతులుచేసి పర్యాటకంగా, చారిత్రాత్మకంగా అభివృద్ధిచేయాల్సిన అవసరం వుంది. గతంలో కొండపైన మ్యూజియం, గెస్ట్ హౌస్ ఏర్పాటు చేస్తామని పాలకులు హామీ ఇచ్చారు. ఆ హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామనిహామీ ఇచ్చింది.కొత్త పాలనలో పర్యాటక అభివద్ధి ఏ మాత్రం జరుగుతోందో వేచిచూడాల్సుంది.

కొండెక్కిన పర్యాటక అభివృద్ధి

పట్టించుకోని ప్రభుత్వం పర్యాటక అభివృద్ధిని మరచిన పాలకులు

ప్రభుత్వాలు,పాలకులు మారుతున్న పెనుకొండలో పర్యాటక అభివృద్ధి మాత్రం హామీలకే పరిమితమైంది. చారిత్రాత్మక ప్రాంతమైన పెనుకొండ పట్టణంలో 365 దేవాలయాలు ఉన్నట్లు తెలుస్తోంది. టెంపుల్ టౌన్ గానే కాకుండా ఈ ప్రాంతం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాబయ్య స్వామి దర్గా, పచ్చపార్శ్వనాథ స్వామి, అజిత్ నాథ్ జైన్ దేవాలయాలు వున్నాయి. పెనుకొండకు పర్యాటకుల తాకిడి వున్నా ఈ ప్రాంతం పర్యాటకంగా మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. 44వ జాతీయ రహదారికి ఆనుకుని కర్నాటక ప్రాంతానికి దగ్గగా ఉన్న ఈ పెనుకొండ పుట్టపర్తి,లేపాక్షి,గోరంట్ల, అమరాపురం, కదిరి కి మధ్యలో ఉంది. పర్యాటక అభివృద్ధికి అన్ని అవకాశాలు వున్నా ఈ ప్రాంతం మాత్రం పర్యాటక అభివృద్ధికి మాత్రం నోచుకోలేదు. శని, ఆదివారం సెలవు దినాలతో పాటు పలు రోజుల్లో పర్యాటకులు పెనుకొండకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా కర్నాటక నుండి ప్రతి శని, ఆదివారాలలో పెద్ద సంఖ్యలో మోటార్ బైకులు, కార్లలో యువత పెనుకొండ కొండకు వస్తుంటారు. పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉన్నా పర్యాటకంగా మాత్రం ఈ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధి చెందలేదు.

మంటపాలు శిథిలం...మెట్ల దారి అధ్వానం!

పెనుకొండ కొండ కు మణిహారం లాంటివి గాలి మండపాలు. నేడు అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ మంటపాలకు వెళ్లేందుకు గగన్ మహల్ వెనుక మెట్ల దారి నిర్మించారు. దాదాపు 500 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ మండపాల్లో కొండపైకి వెళ్లే ప్రజలు అత్యవసర సమయంలో ఈ మంటపాల్లో తలదాచుకునేవారు. ప్రస్తుతం మెట్లదారి మొత్తం ముళ్ల కంపల మయమైంది. శిథిలావస్థకు చేరుకున్న దాదాపు 20 మంటపాలను అభివృద్ధి చేయడంతో పాటు, మెట్ల దారిని మెరుగు పరచాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు..

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ అధికారులు బుధవారం నిర్వహించారు. 75 రోజులకు గాను మొత్తం నగదుగా రు.1,13,14,265లు వచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా విదేశి కరెన్సీలతో పాటు 14 గ్రాముల బంగారు, 810 గ్రాముల వెండి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, యన్.ప్రసాద్, ఆలయం సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజర్, బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కొత్తచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మైల సముద్రం గ్రామంలో బుధవారం డిటిసి సూపర్వైజర్ అబిద్ భాష ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దీని బారిన పడిన వారి లక్షణాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనూష ,రాధ ,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకల జాతి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎరికల సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగమణి తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు. కొత్తచెరువు కు చెందిన నాగమణిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని అన్నారు.

ప్రపంచ అవయవదాన దినోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని రిషి విద్యాలయంలో బుధవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెడ్మాస్టర్ కరణ్ స్వరూపాసింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలేజీ సర్కిల్ నుండి గాంధీ బొమ్మ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అవయవ దానం మీద ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ భాస్కర్ రెడ్డి, సీఈవో రవీంద్ర, ఏవో రంగారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కళ్యాణితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్, సాయినగర్ లో గల అరిగల పోతన్న హాస్పిటల్లో ఈనెల 16న ఉచిత గుండె వైద్య శిబిరమును నిర్వహిస్తున్నట్లు అరిగిల పోతన్న హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేష్ తెలిపారు. అనంతపురంలోని కిమ్స్ సవేరా హాస్పిటల్ సహకారంతో ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవలసిందిగా వారు కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు బుధవారం తెలిపారు. మోత్కుపల్లి మెయిన్ రోడ్డు నందు 11 కె.వి లైన్ లాగుతున్నందున అంతరాయం ఉంటుందని తెలిపారు. మోత్కుపల్లి మెయిన్ రోడ్డు, తిరుమల లేఔట్, శ్రీనివాస ఐటిఐ కళాశాల ప్రాంతంతో పాటు డ్వాక్రా కాలనీ, మార్కండేయ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి బిల్లులు చెల్లించాలి : వ్యకాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉపాధి కూలీలకు బకాయి ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యకాసం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బుధవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం హెచ్ఆర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పది వారాల నుంచి బిల్లులు మంజూరు కాక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బిల్లులు చెల్లించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్ కుమార్, అధ్యక్షులు వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి ,పుట్టపర్తి సిఐటియు నాయకులు పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీలకు గాయాలు

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని చీకటి మాన్ పల్లి సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో 9మంది దినకూలీలు గాయపడ్డారు. నల్లగుట్లపల్లికి చెందిన టమోటా రైతు వద్ద పనిచేయడానికి 9 మంది మహిళా కూలీలు ఆటోలో తనకల్లు నుండి మొలకలచెరువు వైపు వెళ్తుండగా చీకటిమానిపల్లి గ్రామ సమీపంలో తిరుపతి వైపు నుండి బాగల్ కోట్ వైపు వెళ్తున్న తుఫాను వాహనం ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న మొత్తం 9 మంది గాయపడ్డారు. అందులో పుంగనూరు లక్ష్మమ్మ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని వందేమాతరం టీం సభ్యులు అంబులెన్స్ సహాయంతో తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. తుఫాను వాహనం డ్రైవర్ అనిల్ బసవరాజ్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపీ తెలిపారు.

వైసిపి హయాంలో ఆర్థిక విధ్వంసం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గత ప్రభుత్వం చేసిన చేసిన ఆర్థిక అసమానతల వలనే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉపాధి హామీ అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి అధికారులు ఉపాధి సిబ్బంది తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం వల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయిందని అన్నారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమం ,అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు.2014 నుంచి 2022 వరకు పుట్టపర్తి నియోజవర్గంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిలిచిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1, 30, 65, 000 నిధులను కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంజూరు చేసినట్లు తెలిపారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజవర్గంలో నిలిచిపోయిన రూ.1.30 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్యం సంస్థ అధికారులు సిబ్బంది పలువురు రైతులు, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

'ఉల్లాస్... అక్షరాంధ్ర'లో భాగస్వాములవ్వాలి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

'ఉల్లాస్ అక్షరాంధ్ర' అక్షరాస్యత కార్యక్రమంలో అందరూ భాగస్వాములవ్వాలని వయోజన విద్య ఉప సంచాలకులు ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. పుట్టపర్తిలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాంధ్ర ఒకరోజు జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని అంబేద్కర్ భవన్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2023లో జిఎస్ డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాస్ట్ సర్వే ద్వారా శ్రీ సత్యసాయి జిల్లాలో మొత్తం 3,75,876 మంది వయోజన నిరక్షరాసులు గుర్తించబడ్డారని తెలిపారు. వారిలో మొదటి విడతలో 93,886 మందిని ఈ సంవత్సరంలో అక్షరాసులుగా మార్చేందుకు సంబంధిత శాఖల సహకారంతో యాక్షన్ ప్లాన్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మూడు సంవత్సరాల్లో పూర్తి అక్షరాస్యత,రాబోయే మూడేళ్లలో ఈ మొత్తం 3,75,876 మందిని అక్షరాసులుగా మార్చి, శ్రీ సత్య సాయి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం డిఆర్డిఎ డిపిఎం రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "ఉల్లాస్... అక్షరాంధ్ర" అక్షరాస్యత కార్యక్రమంలో జిల్లా,మండల స్థాయి అధికారులందరూ భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి ఈ.జనార్ధన్ గౌడ్, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఏపీఎంలు (డి ఆర్ డి ఏ) , ఏపీఓలు (డ్వామా), సిఎమ్మెమ్ములు (మెప్మా), వయోజన విద్యా సిబ్బంది కె. సుధాకర్, జి. వెంకటరమణ, పి. రవీంద్రనాయుడు, ఎస్. పి. మధుసూదన, వి. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

పరిగి : ప్రస్తుత ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటేనే ఇటు ప్రభుత్వం అటు ప్రైవేట్ రంగంలో ఉన్నతంగా రాణించేందుకు అవకాశం ఉందని జిల్లా టిడిపి తెలుగు యువత నాయకులు ప్రవీణ్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బుధవారం పరిగి మండలంలోని కొడిగేనహళ్లి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో 5 కంప్యూటర్లను వితరణ చేశారు. కోడిగేనహళ్లి పంచాయతీ కార్యాలయానికి ఒకటి, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు రెండు, పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఒకటి, పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మరో కంప్యూటర్ వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సవితమ్మ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి మండల అధికారితో పాటు సచివాలయం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంప్యూటర్ వినియోగం ఎంతగానో అవసరమని దానిని గుర్తించే తన మిత్ర బృందం ద్వారా కంప్యూటర్ల వితరణకు ముందుకు వచ్చినట్లు తెలియజేశారు. కంప్యూటర్ల వితరణతో పాఠశాల హెచ్ఎం ప్రభాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నవీన, పంచాయతీ సెక్రటరీ అరుణ తదితరులు ప్రవీణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం


శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ఉన్న విద్యార్థులతో పాంచజన్య శ్రీనివాసులు, తదితరులు

శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలను బుధవారం పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణ, గోపికలు, యశోధ వేషదారణలో అలరించారు. ఈ సందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు ఉట్టి కొట్టి వేడుకలను ప్రారంభించారు. అనంతరం నాటి సాంప్రదాయాన్ని తలపిస్తు చిన్నారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నంద కుమార్, ఎఇ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, పాఠశాల సూపరింటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అంతర్ రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రూ.18.60 లక్షల విలువైన 31 మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-పెనుకొండ

అంతరాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి 31 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు పెనుకొండ డీఎస్పీ నరసింహగప్ప తెలిపారు. బుధవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ రాఘవన్ తో కలిసి డీఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా నరసింగప్ప మాట్లాడుతూ పెనుకొండ మండలం మునిమడుగు గ్రామానికి చెందిన ఓటన్నగారి వినోద్ కుమార్ తాగుడు, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసేవాడన్నారు. మంగళవారం మండల పరిధిలోని దుద్దేబండ క్రాస్ వద్ద కియా ఎస్ఐ రాజేష్ తన సిబ్బందితో వాహనా తనిఖీలు చేపడుతున్న సమయంలో వినోద్ కుమార్ తాను దొంగలించిన మోటారు సైకిల్ పై వచ్చాడు. ద్విచక్ర వాహనాన్ని ఆపి విచారించగా ద్విచక్ర వాహనాల దొంగతనాలు బయటపడ్డాయని చెప్పారు. అతను దొంగలించిన 31 మోటారు సైకిళ్లను హరిపురం వద్ద ఉన్న పాడుబడిన సిరికల్చర్ కార్యాలయంలో దాచిపెట్టినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వినోద్ కుమార్ పై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయని బెయిల్ పై బయటికి వచ్చి ద్విచక్ర వాహనాలు దొంగలించడం ప్రారంభించాడని డీఎస్పీ వివరించారు. స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాల విలువ రూ.18.60 లక్షలు ఉంటుందని చెప్పారు. అనంతపురంలో 8, కదిరిలో 6, కర్నాటక రాష్ట్రం పావగడలో 5, కర్నూలు జిల్లా డోన్ లో 3, తిరుపతిలో 3, ధర్మవరంలో 2, కళ్యాణదుర్గంలో1, పాకాల లో 1, రొద్దంలో 1, ముదిగుబ్బలో 1 మొత్తం 31 మోటారు సైకిళ్లను దొంగతనం చేశాడన్నారు. దొంగలించిన మొత్తం ద్విచక్ర వాహనాలను బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకోవాలని భావించి ఒక్కచోట డంపు చేసినట్లు ఆయన వివరించారు. మోటారు సైకిళ్ల దొంగతనం చేసిన నిందితుడిని పట్టుకొని 31 మోటారు సైకిళ్ల ను రికవరీ చేయడంలో కీలక పాత్ర వహించిన కియా పోలీసు స్టేషన్ సబ్-ఇన్స్పెక్టర్ రాజేష్, క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్లు నాగరాజు, మారుతి ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డు ప్రకటించారని డీఎస్పీ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని కాలువపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు లక్ష్మమ్మ హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. లక్ష్మమ్మ మంగళవారం సాయంత్రం రోడ్డు దాటుతుండగా మడకశిర వైపుగా వెళ్తున్న కర్నాటక ఆర్టీసీ బస్సు ఆమెను ఢీకొంది. స్థానికులు గమనించి లక్ష్మమ్మను 108 ద్వారా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు కర్నాటక బస్సు డ్రైవర్ పై కేసు నమోదు చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని దాడితోట, నాయనపల్లి గ్రామాల సరిహద్దున ఉన్న చిత్రావతి నది పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారంతో తనిఖీ చేసిన తహశీల్దార్ ట్రాక్టర్‌ను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సచివాలయ మహిళా పోలీస్ పర్వీన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - మడకశిర టౌన్

ఒక్కలిగా కార్పొరేషన్ ఛైర్మన్‌గా లక్ష్మీనారాయణ ఎంపిక పట్ల టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మెళ వాయి ఎంపిటీసీగా, మండల కన్వీనర్ గా పనిచేసిన లక్ష్మీనారాయణ సేవలను గుర్తించిన అధిష్టానం వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమించడం హర్షనీయమన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి రాజీవ్ గాంధీ సర్కిల్ వరకు ఊరేగింపు నిర్వహించారు. చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు.

డ్రగ్స్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు

ప్రజాశక్తి - గుడిబండ

యువత మాదక ద్రవ్యానికి బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ రాజకుల్లయప్ప విద్యార్థులకు సూచించారు. గుడిబండమహాత్మజ్యోతిబాపూలే బాలికలకళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆధార్ సెంటర్ 4 నెలలుగా మూతపడింది. చిన్న పిల్లలకు వేలిముద్రలు, తదితర ఆధార్ అప్‌డేట్ అవసరమైన ప్రజలకు ఇబ్బందులు సడేతేపాకపనే. టేకులోడు సచివాలయంలో ప్రింట్, స్కానర్ పనిచేయకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లల కేవైసీ తప్పనిసరి కావడంతో, తల్లిదండ్రులు చిన్నారులను ద్విచక్రవాహనాలపై గోరంట్ల, బుదిలి, హిందూపురం సెంటర్లకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీర్ఘ ప్రయాణం, సమయం, ఖర్చుతో విసిగిపోయిన వారు మండలంలో తక్షణం కేంద్రం పున్నప్రారంభం చేయాలని లేదా ప్రైవేట్ ఆధార్ ఆపరేటర్లకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో రమణమూర్తి స్పందిస్తూ, చిలమత్తూరు, కోడూరు సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఎదుటివారిని గౌరవించే సంస్కారం ఉండాలి : రఘువీరా

ప్రజాశక్తి మడకశిర టౌన్

ఎదుటివారిని గౌరవించే సంస్కారం ప్రతి వ్యక్తికి ఉండాలని కాంగ్రెస్ సిడబ్ల్యూసి మెంబర్ డాక్టర్ రఘువీరారెడ్డి పేర్కొన్నారు. శ్రీరామ్ రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా ఆయన ఘన నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధులు మాజీ పార్లమెంట్ సభ్యులు శ్రీరామ్ రెడ్డి ఈ ప్రాంతానికి చేసిన సేవలు అమోఘమన్నారు. ఆనాడే పాల ఉత్పత్తిలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఎదగాలన్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

డిప్లొమా ఇన్ ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమా ఇన్ ఫార్మసీ లో ప్రవేశం కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కళ్యాణ్ సూచించారు. రెండేళ్ల నిడివిగల డి. ఫార్మసీ కోర్సులో 2025- 26 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 9వతేదీ నుండి 19 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇంటర్మీడియట్ బైపీసి, ఎంపీసీ, ఓపెన్ ఇంటర్ లో ఎంపీసీ లేదా బైపీసి ఉత్తీర్ణులైన విద్యార్థినులు, సీబీఎస్సీ, ఐ ఎస్ సి ఈ, బోర్డు నుండి తత్సమానమైన పరీక్షలలో ఉత్తీర్ణులైన వారు అర్హులు అని పేర్కొన్నారు. అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల, అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.